# కోర్టు సెంటర్

కథ

**డా॥ ధేనువకొండ శ్రీరామమూర్తి**

**ఒంగోలు కోర్ట్ సెంటర్ అనగానే కోర్టు పక్షులు వేళ్లాడే రెండు పెద్దచెట్లు, సింగ్ హోటలు, మణీస్ కేఫ్, నాయుడు కిళ్లీ షాపు గుర్తుకు వస్తాయి.**

**ఆకలి కానివారు అలా కోర్టు సెంటరుకు వెళ్లి మణీస్ కేఫ్ ముందుగానో, సింగ్ హోటలు ముందుగానో నడిస్తే ఆకలి అంటుకుంటుంది.**

కొబ్బరి చట్నీ, కారప్పొడి, నెయ్యితో ఇడ్లీ, పొట్టు తీయని పెసరపప్పుతో, అల్లం, జీలకర్ర, పచ్చిమిరప ముక్కలు చేర్చిన పెసరట్లకు సింగ్ హోటల్ ప్రసిద్ధి. ఇడ్లీ సాంబారు మణి హోటల్ ఘుమఘుమలు. ఇంటి దగ్గర తిన్నవారైనా సరే హోటల్ ముందుగా వెళ్తుంటే మనసును ఆపుకోలేక మళ్లీ జొరబడి సాంబారు ఇడ్లీ లాగించేవారు.

'సాంబారులో రొయ్య పొట్టు కలిపేవాడు అందుకని అంత రుచి' అని కొందరు అక్కసుతో ప్రచారం చేశారు. అయినా దాని రుచి ముందు ఆ ప్రచారం నిలువలేదు. మణీస్ కాఫీ గురించి కొంచెం చెప్పుకోవాలి. మణి కాఫీ ముందు ఎవడైనా బలాదూర్. వాడి కాఫీకి అంత రుచి ఎలా వచ్చిందో తెలుసుకుందామని చాలామంది క్రిమినల్ లాయరు పట్టాభి దాకా వాకబు చేశారు. ప్రముఖ జర్నలిస్టులు వాసిరాజు, నరసింహం పంతులు కూడా ప్రయత్నం చేశారు.

కోర్టు సెంటర్‌లో నీలగిరి కాఫీ పంతులు మంచి కాఫీ పొడి అమ్మేవారు. పంతులుగారి మీద కూడా నిఘా వేసి నిజం రాబట్టారు. కాఫీ గింజల సెలక్షను మణిది. రోస్టింగ్ మాత్రం పంతులుగారిది అని తేల్చారు.

ఆఫీసులకు వెళ్ళేప్పుడో, ఇళ్ళకు వెళ్ళేప్పుడో మణీస్ కాఫీ తాగి వెళ్లేవారు. మధ్య తరగతి జీవితంలోని శ్రమ, భేదస్వేదాలు, కన్నీళ్లు, రెండు చుక్కలు కాఫీ గొంతులోకి జారగానే అదృశ్యమయేవి. అప్పుడప్పుడు ఫామిలీ విభాగంలోకి వెళ్లి గృహిణులూ కాఫీ సేవించేవారు.

ఊరిలోని రంగారాయుడు చెరువు మంచి నీటికి ప్రసిద్ధి. మణిభార్య, మరదలు సాయంత్రం విలాసంగా మంచినీటికి వచ్చేవారు. చాలామంది మహిళలు ఆ సమయం చూసి కాఫీ కూపీ లాగాలని ప్రయత్నం చేశారు.

"మేం కూడా హోటల్ నుంచే కాఫీ తెప్పించుకుంటాం" అనే సమాధానం మహిళల్ని నిరుత్సాహపరిచింది.


పొద్దున్నే గుగ్గిలం పొగతో శిరిక్కాడి గోవింద రాజన్, మురుగన్ అరవ పాటలు పెట్టాడంటే ఫస్ట్ ఫిల్టర్ కాఫీ రెడీ అన్నమాట.

ఉషోదయాన సంగీత సాధకులు, యోగ సాధకులు కాఫీ కోసం తయారయ్యేవారు. త్యాగరాజు కీర్తనలో, రామదాసు కీర్తనలో పెట్టి ఏడవకూడదా? అని తిట్టుకుంటూ కాఫీ సేవించేవారు.

నుదిటినిండా విభూతి పట్టెడ పెట్టి, బంగారు పూత పెట్టుడు పన్నుతో నవ్వుతూ, మెడలో రుద్రాక్ష బంగారు గొలుసు కనపడేలా ఖాదీ చొక్కాతో ఆకర్షణీయంగా, శుభ్రంగా వుండేవాడు మణి అయ్యరు.

మణీస్‌కేఫ్, సింగ్‌హోటల్లో దేంట్లో తిన్నాగాని నాయుడు కిళ్లీకొట్టు దగ్గర ఆగి జాజి

కా



య, జాపత్రి, పచ్చ కర్పూరం మిశ్రిత లేలేత ఆకు కిళ్లీ వేసుకోవడం రివాజు. నడి వయస్కులకు ఏదో మిశ్రమంతో రాత్రిపూట కిళ్ళీ స్పెషల్.

** ** **

అప్పల నరసింహం ఉరఫ్ అప్పిగాడు అందరి తలలో నాలుకలా ఉండేవాడు. తలలు పండిన పెద్దలు మాట్లాడుకుంటూ, మాట్లాడుకుంటూ మాటల్లో మరచిపోయినపుడు వారివారి కూరగాయల సంచీలను ఇండ్లకు చేర్చేవాడు. పెద్దవాళ్ళ మాటల సంతలోంచి బయట పడలేని పిల్లల్ని, టైముకు స్కూలు దగ్గరకు చేర్చేవాడు. అరకప్పు మణి కాఫీకి అందరి పనులు అలవోకగా చేసేవాడు. ఆ కాఫీ, మితిమీరిన మంచితనం అతడి బలహీనతలు. అధికారం ఎవరు చెలాయిస్తున్నా మౌనంగా ఊరుకొనేవాడు.

నిశ్శబ్ద చిత్రంగా ఉండే అమ్మ అప్పుడప్పుడూ "ఒరేయ్ ప్రయోజకుడివి కారా?" అని శతపోరుతది. .

"నేనేమంత చేతగానివాణ్ణి కాను. ఏదో ఒక రోజున రాజునౌతా!" ఎదురు తిరిగి సమాధానం చెప్పేవాడు.

"పిచ్చికుంకా" అంతలోనే మనసు మెత్తనై వాడి తలనిమిరేది. అప్పిగాడు వారం నుంచీ కనబడటం లేదు. ఇంత హఠాత్తుగా ఏమైపోయాడు? అని అందరినీ కలవరపరిచింది.

"ఇన్నాళ్లు కనబడి కాఫీకి వేపుకు తినేవాడు. ఇప్పుడు కనబడక కాల్చుకు తింటున్నాడు" అనుకున్నారు.

అప్పటిదాకా తాము దయతలచబట్టి వాడి జీవితం ఇలా గడుస్తోందని అనుకునేవారు. వారంరోజుల నుంచి కనబడకపోయేటప్పటికి నిత్యజీవితంలో వీడి అవసరం తెలిసొచ్చింది.

ఆరోగ్యం బాగా లేదేమోనని వాకబు చేస్తే పరిచయం ఉన్న ఆరెంపీ డాక్టర్లు తమ దగ్గరకు రాలేదని ప్రకటించారు.

"ఎదుటివాడికి అనారోగ్యం కలిగించేవాడులా వుంటాడు. వాడికి అనారోగ్యమేమిటి?"

ఒక చీకటి క్షణంలో
స్త్రీ సహజమైన లాలిత్య
ప్రేమోన్మత్త తరంగం రూపాంతరమై
వాసంతి అతని దగ్గరకు వచ్చి "నేనంటే
ఇష్టమేనా?" అంది. శరీర భాషలో నిమ్న
ప్రాకృతిక ధర్మం పెల్లుబికి స్పర్శగా మారి
మనస్సులకు అతీతమైన శరీరాలు
చీకటి ఆకాశంలో
కలిసిపోయాయి.

లాయర్ వెంకటాద్రి జోకే విసిరాడు.

లాయర్ వెంకటాద్రి అంటే ఆ ఊళ్లో అందరికీ ఏవగింపు. గుబురైన కనుబొమ్మలతో, లావు పెదాలతో మోటుగా అనిపిస్తుంటాడు. అతని బుద్ధులు అలాగే మోటుగా ఉంటాయి. జడ్జీలపై పిటీషన్లు వేస్తూ బెదిరించి జడ్జిమెంట్లు అనుకూలంగా తెచ్చుకుంటాడు. అతని బావ మంచి పేరున్న లాయరు. హఠాత్తుగా చనిపోవడంతో అతని కోర్టు ఫైలంతా తానే పొందాడు. కుటుంబ పరిస్థితులను, ఆస్తి పాస్తులను తన చేతుల్లోకి తీసుకున్నాడు. అక్క అమాయకత్వం ఉపయోగపడింది. అందమైన మేనకోడలును కట్టడిచేసి చదువు మానిపించి, విచిత్రహింసలు మొదలెట్టాడు. పెళ్ళిసంబంధాలు రాకుండా వ్యాధి వుందనే నెపంతో అనవసర పరీక్షలు జరిపిస్తూ ఏదోవ్యాధి వుందనే భ్రమ కల్పిస్తూ, సంబంధాలు తిరుగగొట్టేవాడు. అయినా కనిపించని సంధ్యాకాంతుల్ని ఆవాహన చేసుకొన్న అడవిలా ఉంటుంది. జుట్టంతా విరగబోసు కొని స్వప్న ప్రపంచంలో మౌన ప్రేక్షకురాలిగా అంతా గమనించేది. అనాకారిగావున్నా, అందరికీ ఎవరికి ఏమి కావాలో అన్నీ సమకూర్చే అప్పిగాడు ఆప్తుడుగా కనిపించేవాడు వాసంతికి. సామాన్య ప్రాపంచిక సుఖాలకు మించిన మానసిక అనురాగం అతనిలో చూసు కొనేది. చీకటి లోతుల్లోంచి

చొచ్చుకొచ్చిన వెలుతురు రేఖగా అనిపించేవాడు. అప్పిగాణ్ణి చూడగానే కళ్ళు మెరిసేవి. తరచూ ఇంటికి వచ్చే అప్పిగాడి ద్వారా, నవలలు, మంచి పుస్తకాలు తెప్పించుకొనేది.

జాలి కళ్లతో, వెలితి, నిరాసక్తితో అలసిన సౌందర్యం వాసంతిది. చీకటి కాని, వెలుతురు కాని, పల్చటి వెన్నెలలాంటి సంకీర్ణ జీవితం ఆమెది. అతనికి ఆరాధ్యమై ఉంది.

అందరి అవసరాలు తీరుస్తూ ఎవరికి ఏమీ కానీ ఏకాంతంలో తనకంటూ ఏ భావాలూ అభిరుచులూ లేని జీవితం అతనిది. ప్రాకృతిక లిప్సలేని అతని నైర్మల్యం నిండిన మందారాల కాంతిలో మిథ్యాభావనలోంచి సత్యరూపమై వెలుగుతూ పాదరసం లాంటి మనసు ఆవిష్కృతమై ఆకర్షణీయమైంది ఆమెకు.

వెంకటాద్రి భవన సముదాయంలో ఉన్న మణి అయ్యరు, కాఫీ మాస్టరు సుబ్రమణ్యం కుటుంబాలవారు వెంకటాద్రి కుత్సిత పన్నాగాలను పసిగట్టి, మేనకోడలు జీవితాన్ని బీభత్సం చేసే కుటిల పన్నాగాలను గమనించి ధైర్యం ఇచ్చి నైతిక మద్దతు ఇస్తూ బాగోగులు చూసేవారు.



రెండు జ్ఞానవలయాలను వెలుతురు గీతతో కలిపే ప్రయత్నం చేసేవారు.

ఒక చీకటి క్షణంలో స్త్రీ సహజమైన లాలిత్య ప్రేమోన్మత్త తరంగం రూపాంతరమై వాసంతి అతని దగ్గరకు వచ్చి "నేనంటే ఇష్టమేనా?" అంది. శరీర భాషలో నిమ్న ప్రాకృతిక ధర్మం పెల్లుబికి స్పర్శగా మారి మనస్సులకు అతీతమైన శరీరాలు చీకటి ఆకాశంలో కలిసిపోయాయి.

"చూడు!"

చేయి తీసుకుని చుంబించాడు.

** ** **

లాయరు వెంకటాద్రి కోర్టు పనిమీద హైదరాబాద్ వెళ్లటం పది రోజులు అక్కడే వుండటం జరిగింది.

** ** **

ఒక ఉదయం మణి హోటల్ ముందు రిక్షా ఆగింది. నవ వధూవరుల జంట దిగింది. జీన్స్ పాంట్, తెల్లటి టీ షర్టుతో అప్పిగాడు దిగాడు. చింపిరి జుట్టు మారి చక్కటి క్రాఫింగ్ వుంది. మంచి రూపసిగా ఉన్నాడు. చిన్న బిడ్డ చేష్ట తాలూకు నుదిటి మీద కాల్పుడు మచ్చ లేకపోతే ఈ డ్రస్సులో గుర్తు పట్టడం అసంభవం.

మూతికి అడ్డంగా చేయిపెట్టి కచేరి చేసే పిచ్చి మల్లయ్య వీణ్ణి గుర్తుపట్టి సంతోషంగా కనుబొమ్మలు ఎగరేసాడు.

జంటను చూసిన అందరిలో ఆసక్తి పెరిగింది. అప్పిగాడు అందమైన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడన్న వార్త సంచలనం సృష్టించింది. కోర్టు సెంటరులో అందరి ప్రాణాలు అటూ ఇటూ తిరుగాడాయి. అందరి చేతులు, కాళ్ళు కదలడం మానివేశాయి. అందరి మనస్సులు వేగం అందుకొని శబ్ద తరంగాలుగా ఉధృతంగా పరిపరి విధాలుగా మార్మోగాయి. జనం గుమిగూడారు.

ఇద్దరూ సౌమ్యంగా ఫామిలీ సెక్షనులోకి వెళ్ళారు.

వీరిని గమనించిన మణి అయ్యర్ వారి దగ్గరకు వెళ్లాడు. లేచి ఇద్దరూ నమస్కరించారు.

"ఇది కలా! నిజమా!" అని అందరూ ఎవరికి వారు ప్రశ్నించుకున్నారు. ఎదుటివారిని అడిగి నిజమేనని నిర్ధారించుకున్నారు. అదృష్ట దురదృష్టాలు కలిసిన రీతి ఇక్కడే జరిగిందన్నారు. పంచాంగం, గణితం, వేదాంతం కలిపి లెక్కలేసి, వాడి గ్రహబలంవల్లే అంత అందమయిన అమ్మాయి భార్య అయిందని తీర్మానించారు. 'అసూర్యం పశ్య' అయిన లాయర్ వెంకటాద్రి మేన కోడలు అప్పిగాడి భార్య కావడం ఆశ్చర్యంలో ముంచెత్తింది.

కాఫీలు పూర్తయి కౌంటరు దగ్గరకువచ్చి బిల్లు ఇచ్చే సందర్భంలో మణి అయ్యరు వద్దని వారించాడు.

ఒక్క ఉదుటున రొప్పుతూ సుడిగాలిలా లాయర్ వెంకటాద్రి బిగ్గరగా "ఒరేయ్ అప్పిగా" అని కుడికాలు గాలిలోకి ఎత్తాడు. బాలన్స్ తప్పి వెనక్కి పడ్డాడు.

చివరిమెట్టు తలకు తగిలింది. కింద పడ్డాడు. కదలలేదు. చుట్టూ జనం మూగారు.

పిచ్చి మల్లయ్య వెంకటాద్రి మీదకు వంగి ముక్కు దగ్గర వేలు పెట్టాడు.

"సచ్చిపోయిండు"

చేతులు రెండు వెల్లకిలా తిప్పేశాడు మల్లయ్య.



# అమెరికన్ మామ్‌లకు బ్రిట్నీ ఫియర్!

ఆడపిల్లల తల్లులు టీవీలో ఏవైతే కనిపించకూడదని అనుకుంటారో వాటన్నిటినీ బ్రిట్నీస్పియర్ విడమరచి చూపిస్తున్నారు. మోకాలికి తగిలిన గాయం ఉన్నంత పచ్చి గానే ఈమె యాంకీస్ హోటల్ టూర్ ప్రోగ్రాంలూ ఉండడంతో ఇప్పుడు అమెరికా తల్లుల గుండెలు గుబగుబలాడుతున్నాయి. అరకొర బట్టలతో ఉన్న ఓ మేల్ డాన్సర్ మృదువైన పాన్పు పై అంతకన్నా సుతిమెత్తనైన బ్రిట్నీ అర్ధనగ్న దేహాన్ని నిమురుతుండగా ఆమె భావ ప్రాప్తితో మెలికలు తిరగడం టీనేజీ కూతుర్లున్న తల్లులకు చెమటలు పట్టించింది. ఈ దేశ వ్యాప్త ప్రసారం అనేక కుటుంబాల్లో చానెల్ మార్పుతో అదృశ్యమైతే కావచ్చు కానీ అమెరికన్ మామ్‌లను ఒక ప్రశ్న వేధిస్తోంది. బ్రిట్నీ లేత అభిమానులకు వీటివల్ల అందుతున్న సందేశం ఏమిటి? 'పాప్ సెన్సేషన్ బ్రిట్నీ షో చూద్దామని నా ఇద్దరు కూతుళ్లూ రాత్రి పొద్దుపోయే వరకు వేచివున్నారు. ఆ పిల్ల బట్టలు, మూవ్‌మెంట్స్ చూశాక పట్టలేనంత కోపం వచ్చింది. టీవీ స్విచాఫ్ చేశాను' అని బే ఏరియా గృహిణి ఒకరు చిటపటలాడారు. ఈ మాటలు బ్రిట్నీ తలకెక్కితేనే కదా ఒళ్లు దారికొచ్చేది!

# కార్పొరేట్ పెళ్ళిళ్ళు

కార్పొరేట్ సంస్థలలో పని చేస్తున్న కొత్త తండ్రులు ఎగిరి గంతేసేందుకు ఇప్పుడు మరో కారణం తోడయింది. వారి భార్యలు మాతృత్వపు మధురిమలు అనుభవిస్తుండగానే ఆల్టర్నేట్ డేస్‌లో వీరూ హాయిగా తల్లీబిడ్డలతో గడిపే అవకాశాన్ని ఈ కంపెనీలు కల్పిస్తున్నాయి. ఇక వెడ్డింగ్ యానివర్సరీ వచ్చిందంటే ఎన్.ఐ.ఐ.టి. వంటి సంస్థల్లో ఉద్యోగికి రూ.2500 డేటింగ్ అలవెన్స్, జీవిత భాగస్వామిని ఆ ఒక్కరోజు సరదాగా తిప్పుకొని వచ్చేందుకు మెర్సిడెస్ కారు సిద్ధంగా ఉంటాయి. పన్నెండుగంటల షిఫ్టులు, ఊపిరి సలపనివ్వని గడువులతో పోటీపడే కార్పొరేట్ ప్రపంచంలో తాజాగా వస్తున్న మార్పులివి. భార్య ప్రసవించినప్పుడు భర్తకు పని దినాలనుంచి వెసులుబాటు కల్పించడమన్నది కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉన్నప్పటికీ అది బిడ్డ పుట్టిన నాటి నుంచి 15 రోజుల వరకే పరిమితం. ఇందుకు భిన్నంగా పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు ఆర్నెల్లదాకా ఆల్టర్నేట్ హాలిడేను ఇస్తున్నాయి. ఇక ఒకేచోట పనిచేస్తూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్న జంటలకైతే పంట పండినట్టే. రకరకాల పద్ధతుల్లో వారిని గారాబం చేసేందుకు కంపెనీలు పథక రచన చేస్తుంటాయి. సో! ముందు కార్పొరేట్ ఉద్యోగం, తర్వాత కల్యాణం.

